విశాఖపట్టణం
సోమవారం 31 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:219 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ప్రధాని మోడీకి ఉజ్బెకిస్థాన్
# అత్యున్నత పురస్కారం

వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాల్లో ఇరు దేశాధినేతల చర్చలు

సహకారానికి భారత్ ఉజ్బెకిస్థాన్ మధ్య కీలక ఒప్పందాలు



3

# వైఎస్సార్సీపీలో ఏ కోటరీ లేదు

### వైఎస్ జగనే సుప్రీం లీడర్
### ఎల్లో మీడియాతో చేతులు కలిపారు
### విజయసాయిరెడ్డి మతం మారలేదేం
### వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల కౌంటర్







(తాడేపల్లి - జయజయహే)

వైఎస్సార్‌సీపీలో ఎలాంటి కోటరీ లేదని, పార్టీలో నెంబర్ 2, 3 కూడా లేరని.. అన్నింటికీ సుప్రీం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. జగన్ ఒక కోటరీ బందీగా ఉన్నారనడం హాస్యాస్పదమని, పొత్తులు లేకుండా సొంత బలంతో పార్టీని రికార్డు మెజారిటీతో అధికారంలోకి తెచ్చిన ఏకైక నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డినే జగన్ ఎక్కువగా అభిమానించారని, కానీ తాను పార్టీ పెట్టుకోవడం కోసం జగన్ నాయకత్వాన్నే టార్గెట్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వైసీపీలో తాను కోటరీగా ఉంటూ, ప్రభుత్వాన్ని సైతం నడిపించిన అన్ని శాఖల మంత్రి అంటూ విజయసాయిరెడ్డి చేసి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మీడియా సమావేశంలో మాట్లాడిన సజ్జల రామకృష్ణారెడ్డి.. పార్టీ శ్రేణుల్లో ఎలాంటి అపోహలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. విజయసాయిరెడ్డి తన సొంత ప్రయోజనాలు, పబ్లిసిటీ కోసం ఎల్లో మీడియాతో చేతులు కలిపి జగన్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీకి వైఎస్ జగన్ ఒక్కరే నాయకుడని, నంబర్ వన్ లేదా నంబర్ టూ అనే ప్రసక్తే లేదని.. మిగిలిన వారందరూ కేవలం కార్యకర్తలేనని తేల్చిచెప్పారు. భౌతిక దాడి జరిగిందని విజయసాయిరెడ్డి భావిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అందుకు సంబంధించి ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డికి వైఎస్సార్‌సీపీలో ..మిగతా 2లో



# వెలిగొండ చారిత్రాత్మక ఘట్టం

### 31న బహుళార్ధకసాధక ప్రాజెక్టు జాతికి అంకితం
### జలహారతి ఇవ్వనున్న సీఎం చంద్రబాబు

(మార్కాపురం - జయజయహే)

మార్కాపురం జిల్లా పరిధిలోని పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైన వేళ ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. శ్రీశైలం జలాశయ నిల్వల నుంచి కొల్లం వాగు ద్వారా వెలిగొండ సొరంగ మార్గాల్లోకి కృష్ణా జలాలను అధికారులు విడుదల చేశారు. నీటి విడుదలకు ముందు భద్రతా చర్యల్లో భాగంగా అధికారులు సైరన్ మోగించి మొదటి హెచ్చరికను జారీ చేశారు. ఈ ప్రక్రియ పూర్తవ్వడంతో, నిర్ణయించిన ప్రకారం ఆగస్టు 31న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు వద్ద ప్రత్యేక జలహారతి ఇవ్వనున్నారు. అనంతరం క్రాస్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి నల్లమల సాగర్ జలాశయానికి కృష్ణా జలాలను అధికారికంగా విడుదల చేసి, ఈ బహుళార్ధసాధక ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. మార్కాపురం జిల్లా కరవు నేల చరిత్రలో ..మిగతా 2లో

# విజయ సాయిరెడ్డి మరో కే ఏ పాల్

### రాజకీయాల్లో ఆయనో కమెడియన్
### రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా?
### నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నా పర్యవేక్షణేదీ?
### వెన్నుపోటు పార్టీ ధ్వజమెత్తిన బొత్స సత్యనారాయణ.

(విశాఖపట్నం - జయజయహే)



రాష్ట్రంలో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, రోజుకో కొత్త సమస్యతో సామాన్య, మధ్యతరగతి ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు తలకిందులై పిల్లలతో సహా కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, ఆడపిల్లలపై దాడులు, గంజాయి మత్తులో దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని ఆయన మండిపడ్డారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పూర్తిగా గాలికొదిలేసి నిత్యావసర ధరల నియంత్రణలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, డీఎస్సీ అక్రమాలపై శాసనమండలిలో చర్చకు రాకుండా ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. డిఎస్సీపై లోకేష్, చంద్రబాబు తనతో చర్చకు ..మిగతా 2లో



# వెనక్కి తగ్గేది లేదు.!

### కార్యాచరణను వెక్కి తీసుకోలేం
### ఉద్యమాన్ని తప్పుదారి పట్టించలేం
### అమరావతి జేఏసీ నేత బొప్పరాజు స్పష్టీకరణ

(అమరావతి - జయజయహే)

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాము ప్రకటించిన ఉద్యమ కార్యాచరణను ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకునేది లేదని ఏపీ జేఏసీ అమరావతి నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తమ ఉద్యమాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటం ..మిగతా 2లో




## జనసేన యువజన విభాగం
# ఆవిష్కరణ

### సెప్టెంబర్ 2న ఆవిష్కరణ చేయనున్న పవన్

( కాకినాడ - జయజయహే)

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ 2వ తేదీన జనసేన యువజన విభాగం ఆవిష్కరణ ఘనంగా జరగనుంది. పిఠాపురంలో జనసేన యువజన విభాగాన్ని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవిష్కరించనున్నారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యతో కేరళలో చికిత్స పొందుతున్న ఆయన.. ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమానికి హాజరుకానున్నారు. సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు యువజన విభాగాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించనున్నారు. అనంతరం విభాగం లక్ష్యాలు, యువతలో రాజకీయ చైతన్యం వంటి అంశాలపై ..మిగతా 2లో

# వైద్యులకు వన్ నేషన్-వన్ లైసెన్స్



(విశాఖపట్నం జయ జయహే )

భారతదేశంలో వైద్య విద్య, వైద్య సేవలు విస్తరిస్తున్నప్పటికీ, వైద్యుల రిజిస్ట్రేషన్ విధానంలో ఉన్న కొన్ని పరిమితులు దేశవ్యాప్తంగా వైద్య సేవల సులభ లభ్యతకు అడ్డంకిగా మారుతున్నాయి. ఒక రాష్ట్రంలో నమోదైన వైద్యుడు మరొక రాష్ట్రంలో శాశ్వతంగా లేదా దీర్ఘకాలికంగా వైద్య సేవలు అందించాలంటే ఎదురయ్యే పరిపాలనా ప్రక్రియలు, వేర్వేరు రిజిస్ట్రేషన్ అవసరాలు, ధ్రువీకరణ విధానాలు వైద్యుల చలనశీలతను కొంతమేరకు పరిమితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా చెల్లుబాటు అయ్యే ఒకే వైద్య లైసెన్స్ అవసరంపై చర్చకు ప్రాధాన్యత పెరుగుతోంది.

వైద్య వృత్తి స్వభావమే దేశవ్యాప్తంగా ఒకే ప్రమాణాలను కోరుకుంటుంది. వైద్యుడి అర్హత, నైపుణ్యం, వృత్తి నైతికత, రిజిస్ట్రేషన్ వంటి అంశాలకు జాతీయ స్థాయిలో సమాన ప్రమాణాలు ఉన్నప్పుడు, వైద్యుడు ఏ రాష్ట్రంలో పనిచేసినా రోగికి అందే సేవల నాణ్యతపై ..మిగతా 2లో



# సైప్రస్‌లో పడవ బోల్తా

పడవలో సుమారు 270 మంది ప్రయాణికులు

2

For a pure tomorrow.. జయహో

# వైఎస్సార్సీపీలో ఏ కోటరీ లేదు

**మొదటి పేజీ తరువాయి...**

ఎలాంటి అన్యాయం జరగలేదని, పార్టీ ఆవిర్భావం నుంచి ఆయనకు దక్కినన్ని కీలక పదవులు, ప్రాధాన్యత మరెవరికీ లభించలేదని సజ్జల గుర్తుచేశారు. జగన్‌కు సాయిరెడ్డిపై ఉన్న ప్రత్యేక అభిమానం, విశ్వాసం వల్లే ఆయనకు రాజ్యసభ సభ్యత్వం, జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి, పార్లమెంటరీ పార్టీ నేత, ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కేబినెట్ హోదా, ఉత్తరాంధ్ర సమన్వయకర్త వంటి అత్యున్నత బాధ్యతలు ఇచ్చారని వివరించారు. 2020 నుంచే తన ప్రాధాన్యం తగ్గించారని సాయిరెడ్డి ఆరోపించడాన్ని తప్పుబడుతూ, అలాంటప్పుడు 2022లో ఆయనను రెండోసారి రాజ్యసభకు ఎందుకు పంపారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీని వీడే సమయంలో వ్యక్తిగత కారణాల వల్ల వెళ్తున్నానని, ఎవరిపైనా అసంతృప్తి లేదని చెప్పారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా మాట్లాడుతూ.. కొత్త పార్టీ పెట్టుకునేందుకు జగన్‌పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

వైఎస్ జగన్ మతమార్పిడులను ప్రోత్సహించారంటూ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై సజ్జల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబంతో సన్నిహితంగా ఉన్న సాయిరెడ్డికి జగన్ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తారని తెలుసన్నారు. వైఎస్సార్ హయాంలోనే తిరుమలలో



అన్యమతస్తుల ఉద్యోగాలపై చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. నిజంగానే వైఎస్ కుటుంబానికి మతమార్పిడుల అజెండా ఉంటే దశాబ్దాలుగా వారితో ఉన్న సాయిరెడ్డికి కూడా మతమార్పిడి జరిగి ఉండేదని ఎద్దేవా చేశారు. తాను టీడీపీతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకున్నందుకే కేసులు కాలేదన్న ఆరోపణలను తిప్పికొడుతూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేసు నమోదు చేసినప్పుడు రాజకీయాల్లోనే లేనని, తాను సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్‌గా మాత్రమే పనిచేస్తున్నానని తెలిపారు. 2024 తర్వాత తప్పుడు కేసులతో నేతలను ఇబ్బంది పెడుతున్నా విజయసాయిరెడ్డి మాత్రం ఎలా తప్పించుకోగలిగారో ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే టీడీపీ అనుకూల మీడియా విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు విపరీతమైన పబ్లిసిటీ ఇస్తోందని సజ్జల ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు చర్చకు వస్తే టీడీపీ ప్రభుత్వానికి మైనస్ మార్కులు వస్తాయనే ఉద్దేశంతోనే వైఎస్ జగన్ చుట్టూ వివాదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 'మన సాయిరెడ్డి' అనే ఉద్దేశంతో సంయమనం పాటించామని, ఇకపై జగన్‌పై లేదా పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తే అంతే ఘాటుగా సమాధానం ఇస్తామని హెచ్చరించారు. 2024 ఎన్నికల దెబ్బ తర్వాత వైఎస్సార్‌సీపీ కుంగిపోలేదని, సంస్థాగతంగా మరింత బలపడిందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో నుంచి దొంగ ఓట్లను తొలగించిన తర్వాత జరిపే స్థానిక సంస్థల ఎన్నికలకైనా, 2029 సాధారణ ఎన్నికలకైనా లేదా అంతకంటే ముందుగానే ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు వైసీపీ సిద్ధంగా ఉందని సజ్జల ధీమా వ్యక్తం చేశారు.



## నేడు సంచార, అర్ధసంచార

# విముక్త జాతుల దినోత్సవం

అనకాపల్లి (జయ జయహే )

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నేడు సంచార, అర్ధసంచార విముక్త జాతుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రావు గోపాల్‌రావు కళాక్షేత్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. సంచార జాతుల సదాచార వారసత్వం, సంస్కృతికి వారధులుగా నిలిచిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి గుర్తు చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.

ఉదయం 9 గంటలకు బైపాస్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం వుడుపేటలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా కళాక్షేత్రానికి చేరుకుంటామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో పాటు టీడీపీ నాయకుడు పీలా గోవింద తదితర కూటమి నాయకులు పాల్గొంటారని పరమేశ్వరరావు తెలిపారు.

సమావేశంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కే.శ్రీనివాసరావు, పార్టీ ఉపాధ్యక్షుడు పలకా రవి, రాష్ట్ర నాయకుడు కర్రి రామకృష్ణ, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయుడు, డి.శ్రీనివాసరావు, అయ్యప్ప శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ చారిత్రాత్మక ఘట్టం

**మొదటి పేజీ తరువాయి...**

ఆగస్టు 31వ తేదీ సువర్ణాధ్యాయంగా నిలవబోతోంది. దశాబ్దాల తరబడి ఈ ప్రాంత ప్రజలు, రైతాంగం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులను ప్రారంభించి, కృష్ణా జలాలను విడుదల చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నల్లమల సాగర్‌కు 10.7 టీఎంసీల నీటిని తరలించనున్నారు. 3 దశాబ్దాల క్రితం చంద్రబాబు చేతుల మీదుగానే శంకుస్థాపన జరుపుకున్న ఈ డ్రీమ్ ప్రాజెక్టును మళ్లీ ఆయన చేతుల మీదుగానే ప్రారంభించి జాతికి అంకితం చేస్తుండటంతో ప్రకాశం, మార్కాపురం జిల్లాల గ్రామాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం తరహాలోనే వెలిగొండపై ప్రత్యేక దృష్టి సారించి రూ.2,400 కోట్లకు పైగా ఖర్చు పెట్టి మొదటి దశ పనులను వేగంగా పూర్తి చేసింది. ఒకానొక దశలో కలగానే మిగిలిపోతుందనుకున్న ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో ప్రకాశం, మార్కాపురం జిల్లాల రైతాంగానికి సరికొత్త భరోసా లభించింది. ఈ ప్రాజెక్టు పూర్తి కావడం వల్ల వేల ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, తీవ్రమైన ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి శాశ్వత విముక్తి లభించనుంది. ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా పరిశుభ్రమైన తాగునీరు అందించే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశను అధికారికంగా ప్రారంభించబోతున్నారు. మరోవైపు ప్రాజెక్టు నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. కేవలం 3 విడతల్లోనే 6,206 కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారాన్ని నేరుగా అందించడంతో పాటు, అదనంగా మరో రూ.169 కోట్లు ప్రకటించారు. 2019 తర్వాత 18 సంవత్సరాలు నిండిన నిర్వాసిత యువతకు రూ.2 లక్షల చొప్పున సహాయాన్ని అందిస్తున్నారు. నిర్వాసిత మహిళలను గౌరవిస్తూ చీర, పసుపు, కుంకుమ, గాజులతో కూడిన ప్రత్యేక కిట్లను, 10 వేల కుటుంబాలకు 25 కిలోల బియ్యంతో కూడిన ఉచిత నిత్యావసర సరుకుల కిట్లను, 4,933 పశువులకు 30 రోజుల పాటు ఉచిత దాణాను పంపిణీ చేస్తున్నారు. లక్షలాది మంది ప్రజల సమక్షంలో సోమవారం నాడు కృష్ణా జలాల విడుదలతో ఈ చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది.

# వైద్యులకు వన్ నేషన్-వన్ లైసెన్స్

**మొదటి పేజీ తరువాయి...**

విశ్వాసం పెరుగుతుంది. ఇప్పటికే జాతీయ వైద్య కమిషన్ దేశవ్యాప్తంగా వైద్య విద్య, వృత్తి ప్రమాణాలు, వైద్యుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏకీకృత వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తోంది.

ఒక దేశం--ఒక లైసెన్స్ విధానం అమలైతే వైద్యుల భౌగోళిక చలనశీలత గణనీయంగా పెరగవచ్చు. వైద్యుల కొరత ఉన్న ప్రాంతాలకు అవసరమైన నిపుణులు త్వరగా వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు, అత్యవసర ఆరోగ్య పరిస్థితులు ఏర్పడినప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి వైద్యులను వేగంగా సేవలకు వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన, దూర ప్రాంతాల్లో వైద్య నిపుణుల లభ్యతను పెంచేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.

ఇదే సమయంలో దేశంలో వైద్యుల సమాన పంపిణీకి కూడా ఈ విధానం తోడ్పడవచ్చు. ప్రస్తుతం మెరుగైన మౌలిక సదుపాయాలు, అధిక ఆదాయ అవకాశాలు ఉన్న నగరాల్లో వైద్యుల కేంద్రీకరణ ఎక్కువగా కనిపిస్తుంది. ఒకే జాతీయ లైసెన్స్‌తో ఆసుపత్రులు, వైద్య సంస్థలు ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను సులభంగా నియమించుకునే అవకాశం పెరిగితే, వైద్య సేవల భౌగోళిక అసమానతలను కొంతవరకు తగ్గించవచ్చు. అయితే దీనికి మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రోత్సాహకాలు కూడా సమాంతరంగా అవసరం.

అయితే ఒకే లైసెన్స్ అంటే నియంత్రణలు తొలగించడం అని అర్థం కాదు. వైద్యుల అర్హతలను ధ్రువీకరించడం, నిరంతర వృత్తిపరమైన విద్యను నిర్ధారించడం, వైద్య నైతిక ప్రమాణాలను పాటించేలా చూడడం, ఫిర్యాదులపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలు మరింత బలపడాలి. రాష్ట్రాల ఆరోగ్య వ్యవస్థల ప్రత్యేక అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

డిజిటల్ సాంకేతికత ఈ విధానానికి కీలక ఆధారంగా మారవచ్చు. ఒకే జాతీయ డిజిటల్ రిజిస్టర్‌లో వైద్యుడి అర్హతలు, రిజిస్ట్రేషన్, నైపుణ్యాలు, వృత్తిపరమైన స్థితి వంటి వివరాలు భద్రంగా అందుబాటులో ఉంటే, రోగులు, ఆసుపత్రులు, నియంత్రణ సంస్థలకు ధ్రువీకరణ ప్రక్రియ సులభమవుతుంది. అదే సమయంలో వ్యక్తిగత సమాచార భద్రత, డేటా గోప్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి.

అందువల్ల ఒక దేశం--ఒక వైద్య లైసెన్స్ అనేది కేవలం పరిపాలనా సంస్కరణగా చూడకూడదు. ఇది వైద్యుల స్వేచ్ఛాయుత చలనశీలత, అత్యవసర ఆరోగ్య సేవల సమర్థత, వైద్య నిపుణుల సమాన పంపిణీ, రోగులకు మెరుగైన సేవలు అందించే దిశగా తీసుకునే నిర్మాణాత్మక అడుగుగా చూడాలి. జాతీయ ప్రమాణాలు, రాష్ట్రాల అవసరాలు, రోగుల భద్రత---ఈ మూడింటి మధ్య సమతుల్యతను కాపాడుతూ విధానాన్ని రూపొందిస్తే, దేశవ్యాప్తంగా మరింత సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థకు ఇది బలమైన పునాదిగా మారగలదు.

# విజయ సాయిరెడ్డి మరో కే ఏ పాల్

**మొదటి పేజీ తరువాయి...**

సిద్ధమా అని సవాల్ విసిరారు.

గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో పాలన చూస్తుంటే అసలు ప్రభుత్వం ఉందా? అనే అనుమానం కలుగుతోంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ప్రజలు గోదావరి, కృష్ణా నదుల్లో దూకి పిల్లలతో సహా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆడపిల్లలపై అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి. గంజాయి తాగి యాక్సిడెంట్లు చేసి మనుషులను చంపుతున్నారు, కేసుల్లేకుండా మేనేజ్ చేసుకుంటున్నారు. వీటన్నింటినీ అరికట్టాల్సిన ముఖ్యమంత్రి, అధికారిక పర్యటనలకు వచ్చి సమస్యల పరిష్కారంపై కాకుండా కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతున్నారు.



**ఆకాశాన్నంటుతున్న ధరలు**

సామాన్యుడు కడుపునిండా తిని బతికే పరిస్థితి లేకుండా పోయింది. మార్కెట్లో ధరలను నియంత్రించే చర్యలను పూర్తిగా గాలికొదిలేశారు. వేరుశెనగ నూనె గతంలో రూ. 150 - 160 ఉంటే, ఇప్పుడు కిలో రూ. 215కి చేరింది. గ్యాస్ సిలిండర్ ధర రూ. 72 పెరిగి రూ. 937కు చేరింది. పంచదార రూ. 45 నుంచి రూ. 75కి, ఉల్లిపాయలు రూ. 20 నుంచి రూ. 70కి పెరిగాయి. అన్నపూర్ణ లాంటి ఏపీలో నాణ్యమైన బియ్యం కిలో రూ. 40-55 నుంచి ఏకంగా రూ. 65-75కి చేరింది. ధరలు పెరిగితే ఇతర రాష్ట్రాల నుంచి నిత్యావసరాలను తెప్పించి నియంత్రించాలనే సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదు. అందరూ చంద్రబాబులాగా కోటీశ్వరులు కాదు, కిలోకి రూ. 20 పెరిగితే సామాన్యుడు ఎలా బతుకుతాడు?. దేశంలో, ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా పరీక్ష రాయకుండా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా పేరిట ఉద్యోగాలు ఎలా ఇచ్చారు? ముందుగా జీవో ఇచ్చి, ఉద్యోగాలు తమ వాళ్లకు ఇచ్చేసుకున్నాక ఆ జీవోను ఎందుకు రద్దు చేశారు? 430 ఉద్యోగాలను బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నారు. ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి టాప్ ర్యాంక్ ఎలా వచ్చింది? జిల్లాల వారీగా మెరిట్ లిస్టులు ఎందుకు బయటపెట్టలేదు? ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి సీబీఐ విచారణ జరిపించాలి. దమ్ముంటే లోకేష్ లేదా చంద్రబాబు నాతో బహిరంగ చర్చకు రావాలి. అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి.. కౌన్సిల్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వమంటే సమాధానం చెప్పలేక పారిపోయారు. రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఫుడ్ సెక్యూరిటీలను కూటమి ప్రభుత్వం నాశనం చేసింది. పాఠశాలల్లో గోడలు కూలి విద్యార్థులు చనిపోతుంటే మంత్రుల్లో, అధికారుల్లో స్పందన లేదు. 'నాడు-నేడు' పనులన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గతంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పీహెచ్‌సీల్లో మందులు ఇచ్చి పర్యవేక్షించేవాళ్లం, ఇప్పుడు 'సంజీవని' అని పేరు మార్చి ఏ కొత్త విషయం తెచ్చారో చెప్పాలి. ఆసుపత్రులకు వెళ్తే వైద్యం అందక, మందులు లేక ప్రజలను తిప్పి పంపుతున్నారు. రోజుకు పదిసార్లు కరెంటు కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న హామీ ఏమైంది? కొత్తగా ఒక్క పెన్షన్ ఇచ్చే దిక్కులేదు కానీ, మహిళలను లక్షాధికారులను చేస్తామని మాయమాటలు చెబుతున్నారు. వైఎస్సార్ హయాంలో పావలా వడ్డీ, ఆ తర్వాత సున్నా వడ్డీతో మహిళలను ఆదుకుంటే.. చంద్రబాబు రాగానే సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తేశారు. 'తల్లికి వందనం' కింద పూర్తి మొత్తం ఇవ్వకుండా రూ. 7, 8, 9 వేలు మాత్రమే విదిల్చి మిగిలిన బకాయిలను ఎగ్గొట్టారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి ఎందుకు మాట్లాడటం లేదు? అసెంబ్లీలో డీఎస్సీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే ధైర్యం ప్రభుత్వానికి ఉంటే కౌన్సిల్‌లో ఎందుకు చర్చకు రావడం లేదని నేను ప్రశ్నిస్తున్నాను. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల మెంబర్‌షిప్ రద్దు చేస్తామని స్పీకర్ గారు అంటున్నారు. రద్దు చేయమనండి.. ఎదుర్కోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ప్రజలే న్యాయనిర్ణేతలు. నారా లోకేష్ 50 సార్లు పిలిచినా మేం భయపడం. లోకేష్‌తోనే కాదు.. చంద్రబాబు గారితో కూడా బహిరంగ చర్చకు నేను సిద్ధం. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో పరీక్ష రాయకుండా ఉద్యోగాలు ఇవ్వడం, జీవోలు రద్దు చేసి మళ్లీ పునరుద్ధరించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. నిత్యావసర ధరలు పెరుగుతున్నా నియంత్రణ లేదు. తల్లికి వందనం బకాయిలు ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు. పీజు రీయింబర్స్‌మెంట్‌పై తెలంగాణలో మాట్లాడుతున్న కూటమి పార్టీలు ఏపీలో ఎందుకు మాట్లాడటం లేదు? భోగాపురం విమానాశ్రయంలో స్థానికులకు కనీసం 200 ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నారు. స్థానిక ప్రజల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. స్థానిక సంస్థల ఎన్నికలకు మేం సిద్ధంగా ఉన్నాం.. ప్రజల కోసం పోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నాం. విజయసాయిరెడ్డి మాటలపై స్పందించడం టైం వేస్ట్. వాటిని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. గతంలో కేఏ పాల్ ఉండేవారు.. ఇప్పుడు ఆయన రెండో వ్యక్తి. అలాంటి మాటలపై మాట్లాడటం అనవసరం. ఉత్తరాంధ్ర కీలక నేత జనసేనలోకి వెళు తున్నారన్న ఆయన మాటలపై స్పందించాల్సిన అవసరం కూడా లేదు. 200 మంది విశాఖ ఎయిర్ పోర్టులో స్థానిక ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం అన్యాయం. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలకు బాధ్యత లేదా? విశాఖ ఎయిర్‌పోర్టు ఉద్యోగులను కూర్చోబెట్టి మాట్లాడే మానవత్వం కూడా లేకుండా పోయింది అని బొత్స సత్యానారాయణ వ్యాఖ్యానించారు. ఈ సమావేశం లో మాజీ మంత్రి వర్యులు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నా బాబు , జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు బాబు , మన్యం పార్లమెంటు పరిశిలికులు శరగడం చిన్న అప్పల నాయుడు , గాజువాక సమన్వయ కర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి పాల్గొన్నారు

## జనసేన యువజన విభాగం

# ఆవిష్కరణ

**మొదటి పేజీ తరువాయి...**

దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరుకానున్నారు. యువజన విభాగం లోగో, గీతాన్ని మంత్రి ఆవిష్కరించనున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జనసేన ప్రణాళికలు రచించింది. అలాగే తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. ఉప ముఖ్యమంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను ఘనంగా నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొననున్నారు.

# వెనక్కి తగ్గేది లేదు.!

**మొదటి పేజీ తరువాయి...**

చేయడం తమ హక్కు అని పేర్కొన్నారు. ఈనెల 28న నిర్వహించిన సదస్సులో ఉద్యమ కార్యాచరణను ప్రకటించామని బొప్పరాజు తెలిపారు. సామరస్యంగా జరుగుతున్న చర్చలకు తాము విఘాతం కలిగించామని, సీఎం చంద్రబాబును అవమానించేలా కుట్రపూరితంగా వ్యవహరించామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ప్రభుత్వం ఏర్పడి మూడో సంవత్సరం అవుతుంది. మాకు రావాల్సిన డబ్బులు, మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలనే అడుగుతున్నాం. ప్రభుత్వం కాలయాపన చేసినంతకాలం ఓపిగ్గా ఉన్నాం. ఉద్యమం వైపు వెళ్తున్న సమయంలో మమ్మల్ని చర్చలకు పిలిచారని బొప్పరాజు పేర్కొన్నారు. ఐదుగురు మంత్రులు, పది మంది ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీ తమతో చర్చలు జరిపిందని, అయితే 40 రోజులుగా చర్చించిన అంశాల్లో ఇప్పటివరకు ఎలాంటి అమలు జరగలేదని అన్నారు. అనేక సందర్భాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా స్పందన రాకపోవడంతోనే సదస్సులో తమ డిమాండ్లు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తావించామని తెలిపారు.

తమ ఉద్యమానికి రాజకీయ ఉద్దేశాలు ఆపాదించడం సరికాదని బొప్పరాజు అన్నారు. మా ఎజెండా రాజకీయాలు కాదు.. ఉద్యోగుల ఎజెండా. మాకు రాజకీయాలతో పనిలేదు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడమే ముఖ్యమని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఉద్యోగుల సమస్యలపై పోరాడామని, తమ ఉద్యమం ద్వారా 39 జీవోలు సాధించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన చెల్లింపులకు తాము ధన్యవాదాలు కూడా తెలిపామని గుర్తుచేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో జరిగిన సభలో చంద్రబాబు ప్రభుత్వాన్ని అభినందించామని తెలిపారు. ఎంప్లాయీస్ హెల్త్ కార్డు సమస్యను కమిటీకి అప్పగించడంతో సరిపెట్టారని, అప్పటి నుంచి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని అన్నారు. ఉద్యోగులకు వైద్య ఖర్చుల బిల్లులు కూడా మంజూరు కావడం లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని బొప్పరాజు తెలిపారు. ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైద్యం, విద్య కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర జీతాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితిని ఆలోచించరా? పీఆర్సీ విధానం అంటే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా జీతాలు పెంచడం కాదా? ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్రం డీఏలు ఇస్తోంది. మాకు మాత్రం డీఏలు ఇవ్వరు, సమస్యలు పరిష్కరించరు. మాకు న్యాయబద్ధంగా రావాల్సిన డబ్బులు ఇవ్వాలి. వేల కోట్ల రూపాయల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం ప్రకటించాలని బొప్పరాజు డిమాండ్ చేశారు. మీరు ఎన్ని డైవర్షన్‌లు చేసినా మా కార్యాచరణ ఆగదని బొప్పరాజు వెంకటేశ్వర్లు తేల్చిచెప్పారు.

# ప్రధాని మోడీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

భారత్– ఉజ్బెకిస్థాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడిందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఇరు దేశాల సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచడం ఎంతో సంతోషంగా ఉందని వెల్లడించారు. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు మోదీ రెండు రోజుల పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారాన్ని అందజేసింది. అంతకుముందు ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. 'వికసిత్ భారత్', 'యాంగీ ఉజ్బెకిస్థాన్' అనే ఉమ్మడి అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటామని ఇరు దేశాధినేతలు ప్రకటించారు. "ఈ అత్యున్నత పురస్కారాన్ని నేను ఎంతో వినమ్రతతో స్వీకరిస్తున్నాను. ఇరు దేశాల మధ్య ఉన్న శతాబ్దాల నాటి ప్రాచీన స్నేహానికి, మన ఉమ్మడి వారసత్వానికి దీనిని వినమ్ర పూర్వకంగా అంకితం చేస్తున్నాను. మీ దూరదృష్టి గల నాయకత్వం, భారతదేశం పట్ల మీకున్న స్నేహభావం కారణంగా మన ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం బలోపేతం అవుతూ వచ్చాయి. ప్రతి క్షణం అవి సరికొత్త శిఖరాల దిశగా విజయవంతంగా దూసుకెళ్తున్నాయి. దీని ఫలితంగానే, నేడు మన సంబంధాలకు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం అనే సరికొత్త స్థాయి లభించింది. అవార్డు ద్వారా గౌరవ ప్రతిష్టలు దక్కుతాయన్నది నిజమే, కానీ ఒక అవార్డు తనతో పాటు ఒక మహత్తరమైన బాధ్యతను కూడా మోసుకొస్తుందని నాకు బాగా తెలుసు. ఈ రోజు నేను ఈ అవార్డును స్వీకరిస్తున్న వేళ, ఆ బాధ్యతను మనస్ఫూర్తిగా గుర్తిస్తున్నాను. ఉజ్బెకిస్థాన్ చారిత్రక గడ్డ పైనుంచి నేను అక్కడి ప్రజలకు ఒక నమ్మకాన్ని ఇవ్వాలనుకుంటున్నాను. భారతదేశం ఎన్నటికీ తన బాధ్యతల నుంచి వెనకడుగు వేయదు, ఈ స్నేహాన్ని చిత్తశుద్ధితో



నిలబెట్టుకుంటుందిమరో 2 రోజుల్లో ఉజ్బెకిస్థాన్ 35వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనున్న సందర్భంగా ఆ దేశ ప్రజలకు మోదీ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. భారత్– ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 15 ఏళ్లు పూర్తవుతున్న శుభ సందర్భంలో, ఇరు దేశాల సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ఇరు దేశాలు కలసి ముందుకు సాగుతాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌లో 'యోగా ఫెడరేషన్ ఆఫ్ ఉజ్బెకిస్థాన్' ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సెషన్‌లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఉజ్బెకిస్థాన్‌లో యోగాకు విశేష ఆదరణ ఉందని, ఇది రెండు దేశాల ప్రజలు, సంస్కృతులను ఏకం చేస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. అంతకుముందు నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్ విమానాశ్రయంలో ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా యాంగి ఉజ్బెకిస్థాన్ పార్కును సందర్శించిన ప్రధాని, అక్కడి స్వాతంత్ర్య స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం ప్రవాస భారతీయలతో మోదీ సమావేశమయ్యారు. ప్రవాసులు అందించిన ఆప్యాయత తనను ఎంతగానో ఆకట్టుకుందని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రవాసులు ప్రదర్శించిన కథక్, అండిజాన్ పోల్కా నృత్యాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఉజ్బెకిస్థాన్‌లోని అధికారిక కార్యక్రమాల అనంతరం మోదీ కిర్గిజిస్థాన్ చేరుకుంటారు. బిష్కెక్ నగరంలో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు.

# రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా..?

- నిత్యావసరాల పర్యవేక్షణేదీ
- డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో 430 పోస్టుల భారీ కుంభకోణం..
- దమ్ముంటే సీబీఐ విచారణ వేయాలి
- బహిరంగ చర్చకు లోకేష్, బాబు సిద్ధమా
- ధ్వజమెత్తిన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ.

**విశాఖపట్నం, ఆగష్టు 30, జయ జయహే :**



రాష్ట్రంలో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, రోజుకో కొత్త సమస్యతో సామాన్య, మధ్యతరగతి ప్రజల మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు తలకిందులై పిల్లలతో సహా కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, ఆడపిల్లలపై దాడులు, గంజాయి మత్తులో దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని ఆయన మండిపడ్డారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పూర్తిగా గాలికొదిలేసి నిత్యావసర ధరల నియంత్రణలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, డీఎస్సీ అక్రమాలపై శాసనమండలిలో చర్చకు రాకుండా ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. డిఎస్సీపై లోకేష్, చంద్రబాబు తనతో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో పాలన చూస్తుంటే అసలు ప్రభుత్వం ఉందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ప్రజలు గోదావరి, కృష్ణా నదుల్లో దూకి పిల్లలతో సహా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆడపిల్లలపై అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని చెప్పారు. గంజాయి తాగి యాక్సిడెంట్లు చేసి మనుషులను చంపుతూ కేసుల్లేకుండా మేనేజ్ చేసుకుంటున్నారని, వీటన్నింటినీ అరికట్టాల్సిన ముఖ్యమంత్రి, అధికారిక పర్యటనలకు వచ్చి సమస్యల పరిష్కారంపై కాకుండా కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతున్నారని దుయ్యబట్టారు.

**డీఎస్సీ స్పోర్ట్స్ కుంభకోణంపై సీబీఐ ఎంక్వైరీ వేయండి!**

దేశంలో, ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా పరీక్ష రాయకుండా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా పేరిట ఉద్యోగాలు ఎలా ఇచ్చారు? ముందుగా జీవో ఇచ్చి, ఉద్యోగాలు తమ వాళ్లకు ఇచ్చేసుకున్నాక ఆ జీవోను ఎందుకు రద్దు చేశారు? 430 ఉద్యోగాలను బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నారు. ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి టాప్ ర్యాంక్ ఎలా వచ్చింది? జిల్లాల వారీగా మెరిట్ లిస్టులు ఎందుకు బయటపెట్టలేదు? ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి సీబీఐ విచారణ జరిపించాలి. దమ్ముంటే లోకేష్ లేదా చంద్రబాబు నాతో బహిరంగ చర్చకు రావాలి. అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి.. కౌన్సిల్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వమంటే సమాధానం చెప్పలేక పారిపోయారు.

**స్పీకర్ బెదిరింపులకు భయపడం -- ఎన్నికలకు మేం సిద్ధం..!**

వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు సభకు రాకపోతే సభ్యత్వాలు రద్దు చేస్తామని స్పీకర్ అంటున్నారు.. దమ్ముంటే రద్దు చేయమనండి, మేం సిద్ధంగా ఉన్నామని, ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలు, వారే తీర్పు చెబుతారని తేల్చి చెప్పారు. భోగాపురం విమానాశ్రయంలో 50 వేల ఉద్యోగాలని ఊదరగొట్టి, కనీసం స్థానికులకు 200 ఫోర్త్ క్లాస్ ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డ బొత్స... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను మేం ఆపం, ఎన్నికలను ఎదుర్కొని ప్రజల పక్షాన పోరాడటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్న బాబు , జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు , మన్యం పార్లమెంటు పరిశీలక"లు శరగడం చిన్న అప్పల నాయుడు , గాజువాక సమన్వయ కర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి పాల్గొన్నారు

# గోదావరి జలాలతో అనకాపల్లికి కొత్త జలశకం

**అనకాపల్లి జయ జయహే**



నక్కపల్లిలో పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్టుకు శ్రీకారంతో పండగ వాతావరణం లో ప్రారంభోత్సవం జరగబోతున్నది ఈ కార్యక్రమానికి అందరూ భాగస్వాములు అయ్యి విజయవంతం చేయాలని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ పిలుపునివ్వడం జరిగింది స్థానిక రింగ్ రోడ్డు లో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొనతాల రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు క్లస్టర్ ఇన్చార్జిలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం గోదావరి జలాల సాధనకు మరో కీలక ముందడుగు పడనుందని గతంలో ఎన్నో పోరాటాలు ఉద్యమాల ఫలితంగా నేడు గోదావరి జలాలను ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తీసుకురావాలని లక్ష్యం సహకారం దిశగా ఇన్నాళ్లకు అడుగులు పడుతున్నాయని ఆయన అన్నారు గోదావరి జిల్లా పురుషోత్తమ పట్నం నుంచి అనకాపల్లి మీదుగా విశాఖపట్నం ఉత్తరాంధ్ర ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా తాగునీరు పారిశ్రామిక అవసరాలు వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరనుంది అని తెలియజేశారు ఈ ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో ఉత్తరాంధ్రలోని అనేక ప్రాంతాలకు 24/7 తాగునీటి సరఫరా అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పోలవరం ఎడమ కాలువతో గోదావరి జలాలు అందుబాటులోకి రావడం అలాగే ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే కాకుండా పారిశ్రామిక అభివృద్ధి వ్యవసాయానికి కూడా మరింత ఊతం లభిస్తుందని ఆయన అన్నారు ఇలాంటి మహత్తర కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 2వ తేదీన నక్కపల్లిలో గోదావరి జలాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న న్నారని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు రైతులు ప్రజలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమము విజయవంతం చేయాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ఘనంగా నిర్వహించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త జలశకం శకానికి స్వాగతం పలుకుదామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు పీల గోవింద సత్యనారాయణ రాష్ట్ర గౌర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ మరియు కూటమి క్లస్టర్ ఇన్చార్జులు అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు



# సైప్రస్‌లో పడవ బోల్తా

## సుమారు 270 మంది ప్రయాణికులు...

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

సైప్రస్‌లోని కైరేనియా నుంచి తుర్కియేలోని టౌచుకు సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తుండగా బోల్తా పడింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. దాదాపు 159 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగాయి. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కైరేనియా మేయర్ మురాత్ సెన్‌కుల్ వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటనలో భారీ ప్రాణనష్టం జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. కోస్టు గార్డుకు చెందిన పడవలు, హెలికాప్టర్లు సహా ప్రయాణికుల పడవలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. బాధితులను ఆసుపత్రులకు చేర్చేందుకు తీరంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. అయితే, ప్రమాద సమయంలో పడవలో కచ్చితంగా ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు.



# రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

**మునగపాక, ఆగస్టు 30, జయ జయహే:**

మునగపాక మండలంలోని తోటాడ గ్రామంలో త్రిమూర్తులు గుడి వద్ద మదర్ మెమోరియల్ ఫౌండేషన్, అన్నపూర్ణ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలను కరాటే కోచ్ శివ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. విజేతలకు అనకాపల్లి వర్తక సంఘం నాయకులు కొణతాల లక్ష్మీనారాయణ బహుమతులు పంపిణీ చేశారు. ఆళ్ల శ్రీనివాసరావు, తన తల్లి ఆళ్ల వరలక్ష్మి జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమం పతియేట నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఇలాంటి పోటీలతో పాటు పేదలకు దుస్తులు పంపిణీ కూడా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు. తల్లి పేరుతో ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆళ్ల శ్రీనివాసరావును పలువురు అభినందించారు.




# జార్జ్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే రామకృష్ణ అభినందనలు

**అనకాపల్లి జయ జయహే**

ఇటీవల జరిగిన జార్జి క్లబ్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది నూతన కార్యవర్గ సభ్యులు ప్రెసిడెంట్ దాడి బుజ్జి సెక్రటరీ కొణతాల మురళి మరి సభ్యులు ను ఎమ్మెల్యే రామకృష్ణ శుభాకాంక్షలు తెలియజేసి వారిని ఘనంగా సత్కరించే అభినందించారు జార్జ్ క్లబ్ అభివృద్ధికి సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం మరింత కృషి చేయాలని ఆయన కోరారు

# పంచలోహ మకర తోరణానికి 25 వేలు విరాళం

**మాడుగుల ఆగస్టు 30 జయ జయహే**



మాడుగుల మండలం ఎం కోడూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో పంచలోహాల మకర తోరణం ఏర్పాటుకు ఏం కోడూరు గ్రామానికి చెందిన అప్పన్న వెంకటరమణ కుమారులు శ్రీనివాసరావు కృష్ణ సాగర, కుమార్ , ముగ్గురు దంపతులు ఆదివారం 25 వేల రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు.



## స్మార్ట్‌ఫోన్ చేతిలో... నియంత్రణ మన చేతిలో ఉందా?

(ప్రతాప్)

ఒకప్పుడు స్మార్ట్‌ఫోన్ మన అవసరాలను తీర్చే సాధనం. ఇప్పుడు అది మన రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారింది. ఉదయం నిద్రలేచిన క్షణం నుంచి రాత్రి పడుకునే వరకు ఫోన్ మనతోనే ఉంటుంది. సమాచారం, విద్య, వినోదం, ఉద్యోగం, వ్యాపారం, బ్యాంకింగ్ వంటి అనేక రంగాల్లో స్మార్ట్‌ఫోన్ మన జీవితాన్ని సులభతరం చేసింది. అయితే సౌకర్యాన్ని అందించే ఈ సాంకేతిక సాధనం మన సమయాన్ని, ఏకాగ్రతను, సంబంధాలను కూడా నెమ్మదిగా ఆక్రమిస్తుంటే ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ముఖ్యంగా యువతలో సోషల్ మీడియా, షార్ట్ వీడియోల వినియోగం విపరీతంగా పెరిగింది. కొన్ని నిమిషాల వినోదం కోసం ఫోన్ తీసుకున్న వ్యక్తి గంటల తరబడి స్క్రీన్ ముందు గడిపే పరిస్థితి సాధారణమవుతోంది. ఒక వీడియో తర్వాత మరొక వీడియోను చూడాలనే అలవాటు సమయాన్ని తెలియకుండానే హరించేస్తోంది. ఫలితంగా చదువుపై ఏకాగ్రత తగ్గడం, పనులను వాయిదా వేయడం, నిద్ర సమయం దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

అయితే సాంకేతికతను నిందించడం పరిష్కారం కాదు. అదే స్మార్ట్‌ఫోన్ ఒక విద్యార్థికి ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా వనరులను అందించగలదు. ఒక యువకుడికి ఉద్యోగ అవకాశాలను పరిచయం చేయగలదు. ఒక చిన్న వ్యాపారికి తన ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసే అవకాశం కల్పించగలదు. రైతుకు మార్కెట్ సమాచారం, ప్రజలకు ప్రభుత్వ సేవలు, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించగలదు. కాబట్టి సమస్య స్మార్ట్‌ఫోన్‌లో లేదు; దాన్ని మనం ఎలా ఉపయోగిస్తున్నామన్నదే అసలు ప్రశ్న.

ప్రత్యేకంగా పిల్లలు, యువతకు డిజిటల్ క్రమశిక్షణ అవసరం. ఎంతసేపు ఫోన్ వాడుతున్నామన్నదే కాకుండా, దేనికోసం వాడుతున్నామన్నదీ ముఖ్యమే. వినోదానికి కేటాయించే సమయానికి పరిమితి పెట్టుకుని, విద్య, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకతకు సాంకేతికతను ఉపయోగించాలి. తల్లిదండ్రులు కూడా కేవలం ఆంక్షలు విధించడం కంటే పిల్లలకు బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగాన్ని నేర్పాలి.

సోషల్ మీడియాలో కనిపించే ప్రతి విషయం నిజం కాదనే అవగాహన కూడా అవసరం. తప్పుడు సమాచారం, మోసపూరిత ప్రకటనలు, అనవసరమైన పోలికలు మన ఆలోచనలను ప్రభావితం చేయకుండా విమర్శనాత్మక దృష్టిని పెంచుకోవాలి.

సాంకేతికత మనిషి జీవితాన్ని మెరుగుపరచడానికి పుట్టింది; మనిషి జీవితాన్ని నియంత్రించడానికి కాదు. ఫోన్ మన చేతిలో ఉండాలి కానీ మన జీవితం ఫోన్ చేతిలో ఉండకూడదు. డిజిటల్ ప్రపంచాన్ని దూరం చేసుకోవడం కాదు, దానిపై మన నియంత్రణను పెంచుకోవడమే సమయానుకూలమైన మార్గం.



## హార్ముజ్‌లో ఉద్రిక్తత... భారత్‌లో ఇంధన ధరలపై ప్రభావం?

(ప్రతాప్)

ప్రపంచ పటంలో హార్ముజ్ జలసంధి ఒక సన్నని సముద్ర మార్గమే కావచ్చు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అది అత్యంత కీలకమైన ఇంధన ద్వారం. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే ఈ మార్గం ద్వారా ప్రపంచ చమురు, సహజవాయువు రవాణాలో గణనీయమైన భాగం సాగుతుంది. అందుకే ఇక్కడ ఏర్పడే ఏదైనా తీవ్రమైన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత అంతర్జాతీయ మార్కెట్లను కుదిపే సామర్థ్యం కలిగి ఉంటుంది.

హార్ముజ్‌లో రవాణాకు అంతరాయం ఏర్పడుతుందనే భయం మొదలైతే చమురు మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతుంది. వాస్తవ సరఫరా తగ్గకపోయినా, భవిష్యత్ సరఫరాపై సందేహాలు ధరలను పైకి నెట్టగలవు. చమురు ధరల పెరుగుదల రవాణా ఖర్చులను మాత్రమే కాదు, ఉత్పత్తి, విద్యుత్, ఎరువులు, విమానయానం, సరుకు రవాణా వంటి అనేక రంగాల వ్యయాలను ప్రభావితం చేస్తుంది. చివరకు దాని భారం వినియోగదారుడిపైనే పడే ప్రమాదం ఉంది.

భారత్ వంటి పెద్ద ఇంధన దిగుమతి ఆధారిత దేశానికి ఈ పరిణామం మరింత ప్రాధాన్యమైనది. అంతర్జాతీయంగా ముడిచమురు ధర పెరిగితే దిగుమతి బిల్లు పెరుగుతుంది. దాంతో కరెంట్ అకౌంట్‌పై ఒత్తిడి రావచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దిగుమతి చేసుకునే ముడి పదార్థాలు, యంత్రాలు, ఇతర వస్తువుల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కూడా ఏర్పడవచ్చు.

అయితే ప్రతి అంతర్జాతీయ సంక్షోభం భారత్‌కు ఒకే స్థాయిలో నష్టం కలిగిస్తుందని భావించడం సరైంది కాదు. భారత్ తన చమురు దిగుమతుల మూలాలను విభిన్నీకరించుకోవడం, వ్యూహాత్మక చమురు నిల్వలను బలోపేతం చేయడం, దేశీయ ఉత్పత్తిని పెంచడం వంటి చర్యల ద్వారా ప్రమాదాన్ని కొంతవరకు తగ్గించగలదు. అదే సమయంలో సౌర, పవన, హరిత హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై పెట్టుబడులు పెంచడం దీర్ఘకాలిక ఇంధన భద్రతకు దోహదం చేస్తుంది.

హార్ముజ్ సమస్య కేవలం మధ్యప్రాచ్య రాజకీయాల సమస్య కాదు. అది ప్రపంచ సరఫరా గొలుసులు ఎంత పరస్పర ఆధారితంగా మారాయో గుర్తుచేసే ఉదాహరణ. ఒక ప్రాంతంలోని ఉద్రిక్తత వేల కిలోమీటర్ల దూరంలోని దేశాల్లో ధరలు, ద్రవ్యోల్బణం, వ్యాపార వ్యయాలను ప్రభావితం చేయగలదు.

అందువల్ల తక్షణ సంక్షోభ నిర్వహణతో పాటు దీర్ఘకాలిక ఇంధన వ్యూహం అవసరం. ఇంధన భద్రత అంటే కేవలం తగినంత చమురు కలిగి ఉండటం కాదు; సరఫరా మార్గాలు, వనరులు, సాంకేతికతలను విభిన్నీకరించుకోవడం కూడా. ప్రపంచ రాజకీయాల్లో అనిశ్చితి పెరుగుతున్న వేళ, ఇంధన స్వావలంబన దిశగా వేగంగా అడుగులు వేయడం భారతదేశానికి వ్యూహాత్మక అవసరం.

# నేడు సంచార జాతుల స్వతంత్ర దినోత్సవం





**సందర్భంగా 10వ వార్షికోత్సవ సభ ప్రతినిధుల సదస్సు**

**సమయం : ఉదయం 10 గంటలకు**

**వేదిక: తాడేపల్లి వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం**

**సభాధ్యక్షులు : పెంద్ర వీరన్న , సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు**

### సంచార జాతుల వారు అంటే ఎవరు...!

చారిత్రక పాత్ర: నేడు సంచార జాతులుగా వున్న అనేక కులాల వారు గతంలో అంటే రాజుల కాలంలో గూఢచారులుగా, సైనిక శిక్షణ ఇస్తూ, ఆయుధాలు తయారు చేస్తూ రాజ్య రక్షణలో కీలక పాత్ర పోషించారు. సాంస్కృతిక వైద్య సేవలు, యక్షగానాలు, బుర్రకథలు, హరికథల ద్వారా సంస్కృతిని కాపాడుతూ, నాటు/ఆయుర్వేద వైద్యం ద్వారా ప్రజాసేవ చేశారు.

– క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ (1871): బ్రిటిష్ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉన్నారనే నెపంతో దాదాపు 500 తెగలను పుట్టుకతోనే 'క్రిమినల్స్'గా ముద్ర వేసింది.విముక్తి దినోత్సవం: శ్రీ అనంత్ శయనం అయ్యంగార్ కమిటీ నివేదిక ఆధారంగా 1952 ఆగస్టు 31న ఈ చట్టం రద్దయింది. అందువల్ల ఆగస్టు 31ని సంచార జాతుల స్వతంత్ర దినోత్సవంగా జరుపుకుంటారు.

### ప్రస్తుత పరిస్థితి అండ్ జీవనోపాధి

– నేటికీ విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక ప్రాతినిధ్యానికి దూరంగా దయనీయ జీవితాన్ని గడుపుతున్నారు. నివాసానికి సొంత స్థలం లేక ఊరి చివరన, రోడ్ల పక్కన, స్మశానాల వద్ద గుడారాల్లో జీవిస్తున్నారు. పూసలు/గాజులు అమ్మడం, గొడుగులు బాగు చేయడం, గంగిరెద్దులు ఆడించడం, పగటి వేషాలు, వనమూలిక నాటు వైద్యం, ఎలుకలు పట్టడం వంటి ప్రమాదకర వృత్తులపై ఆధారపడుతున్నారు.

### కమిషన్లు అండ్ వర్గీకరణ సమస్యలు..!

కాకా కాలేకర్, జస్టిస్ లోకూర్, బి.పి. మండల్, జస్టిస్ వెంకటాచలయ్య, రేణుకే కమిషన్, భికురాంజి విధాతే కమిషన్లు నివేదికలు ఇచ్చినా సరైన న్యాయం జరగలేదు. 1968 అనంతరామన్ కమిషన్ ద్వారా బీసీ-ఏ లో 36 సంచార తెగలను చేర్చినప్పటికీ, బలమైన సామాజిక వర్గాల వల్ల వీరికి ఫలాలు అందడం లేదు. స్థానిక సంస్థలలో ప్రత్యేక వాటా లేక, అలాగే కేంద్ర ఓబీసీ 27శాతం రిజర్వేషన్లలో ఏబిసిడి వర్గీకరణ లేకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతోంది.

### సామాజిక న్యాయం కోసం ప్రధాన డిమాండ్లు...!

బీసీ జాబితాలోని సంచార జాతులకు విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి. చట్టసభల్లో (శాసనమండలి) ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి. కూటమి ప్రభుత్వం వెంటనే ఎంబీసీ కార్పొరేషన్ పాలకమండలిని ప్రకటించాలి. రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో 5శాతస్త్ర ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వాలి. ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత/రాయితీ విద్యుత్ అందించాలి. మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యులుగా మరియు దేవాలయ పాలకమండళ్లలో సభ్యత్వం కల్పించాలి.ఎ సంచార జానపద కళాకారులకు ఐడీ కార్డులు ఇచ్చి 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేయాలి. సంచార జాతుల ఎంబీసీ వర్గాల వారికి గత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు పక్క ఇల్లుతో నవరత్నాల సంక్షేమ పథకాలు ఎంతమందికి లబ్ధి చేకూరింది అనేది ఒకసారి పరిశీలిద్దాం....!

### సంక్షేమ పథకం పేరు లబ్ధిదారుల సంఖ్య నగదు మొత్తం

1.ఆసరా పథకం ద్వారా43,681 మందికి రూ. 11 కోట్ల 52 లక్షల 33 వేల 895
2.అమ్మఒడి పథకం ద్వారా 42,575 మందికి రూ. 17 కోట్ల 62 లక్షల 81 వేల 295
3.హౌసింగ్ పథకం ద్వారా7,470 మందికి రూ. 71 కోట్ల



2 లక్షల 90 వేల 857
4.జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 16,445 మందికి రూ. 35 కోట్ల 78 లక్షల 63 వేల 573
5.జగనన్న వసతి దీవెన పథకం ద్వారా 14,326 మందికి రూ. 15 కోట్ల 93 లక్షల 87 వేల 600
6.వై.ఎస్.ఆర్. కళ్యాణమస్తు పథకం ద్వారా రూ. 111 మందికి60 లక్షల 50 వేలు
7.లా నేస్తం పథకం ద్వారా ఇద్దరికి రూ. 1 లక్ష 20 వేలు



8.మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ. 51 మందికి12 లక్షల 40 వేలు
9.పాస్టర్ల కు గౌరవవేతనం ద్వారా 91 మందికి రూ. 4 లక్షల 55 వేలు
10.వాహనమిత్ర పథకం ద్వారా 2,353 మందికి రూ. 7 కోట్ల 37 లక్షల 20 వేలు
11.వై.ఎస్.ఆర్ చేయూత పథకం ద్వారా23,505 మందికి రూ. 10 కోట్ల 39 లక్షల 59 వేల 357
12.వై.ఎస్.ఆర్ పింఛన్ పథకం ద్వారా44,527 మందికి రూ. 41 కోట్ల 89 లక్షల 31 వేల 400
13.వై.ఎస్.ఆర్. బీమా పథకం ద్వారా824 మందికి రూ. 12 కోట్ల 75 లక్షల 10 వేలు
14.వై.ఎస్.ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా14,710 మందికి రూ. 52 కోట్ల 55 లక్షల 26 వేల 316
15.వై.ఎస్.ఆర్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా9,505 మందికి రూ. 6 కోట్ల 19 లక్షల 64 వేల 425
16.వై.ఎస్.ఆర్ సున్నా వడ్డీ పథకం ద్వారా62,893 మందికి రూ. 24 కోట్ల 86 లక్షల 90 వేల 803
17.జగనన్న చేదోడు పథకం ద్వారా1,909 మందికి రూ. 51 కోట్ల 8 లక్షల 50 వేలు
18.నేతన్న నేస్తం పథకం ద్వారా362 మందికి రూ. 2 కోట్ల 72 లక్షల 88 వేలు
19.జగనన్న తోడు (వడ్డీ) పథకం ద్వారా7,879 మందికి రూ. 3 కోట్ల 63 లక్షల 8 వేల 915
20.జగనన్న తోడు లోన్స్ ద్వారా12,954 మందికి రూ. 19 కోట్ల 36 లక్షలు
21.కరోనా సహాయం నిమిత్తం81,147 మందికి రూ. 81 కోట్ల 14 లక్షల 7 వేలు.

మొత్తం 175 నియోజకవర్గాలలో మన 32 సంచార జాతుల వారికి గత గత ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు వ్యవధిలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి వేసిన నగదు మొత్తం. పథకాల లబ్ధిదారు సంఖ్య 4 లక్షల 90 వేల 91 మందికి అందిన లబ్ధి రూ. 1288 కోట్ల 44 లక్షల 73 వేల రూపాయలు. ఆనాటి ప్రభుత్వంలో ఎంత లబ్ధి చేకూరిందో. ఈ రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో ఎంత కోల్పోయామనేది ఓ సారి ఆలోచిద్దాం!

### ప్రముఖ సంచార జాతులు

బాలసంతు/బాలరూపి, వీరభద్రీయ్య/వీరముష్టి, మందుల, గోత్రాలు, బుడబుక్కల, వాల్మీకి బోయ, కాశికాపుడి, దాసరి, సికిలేగర్, దొమ్మర/గిరిబలిజ/పూసల, గంగిరెద్దుల, కంజరభట్ట, ఆరేమరాఠి/సురభి నాటకాల వారు, జంగమ, కెంపుమారే, రెడ్డిక, మొండిపట్ట, కృష్ణబలిజ, కాటిపాపల, పరికిముగ్గుల, తోలు బొమ్మలాటవాళ్లు, మేదర/మహేంద్ర, మొండిబండ/బండ/మొండివారు, వంశరాజ్/పిచుగుంట్ల, జోషి నందివాల, వడ్డెర/వడ్డీలు, కూనపులి, పెద్దమ్మవాండ్లు/దేవరాండ్లు/ఎల్లమ్మవాండ్లు, రాజన్నల రాజన్నలు, జోగి, పంబల, పాముల, పార్ధి, కైకాడి, పత్రా, తదితర కులాలు ఉన్నవి.

ఈ వ్యాసం రాసిన వారు :
**పెంద్ర వీరన్న**
సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు.
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు.
వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు,
ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్.





# విజయవంతమైన రక్తదాన శిబిరం

**చోడవరం, ఆగస్టు 30, జయ జయహే**



సెప్టెంబర్ 2 న జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చోడవరం పట్టణంలోని ప్రేమ సమాజంలో ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాతలను అభినందించారు.

ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, జనసేన పార్టీకి సేవా కార్యక్రమాలు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని, ప్రజలకు అండగా నిలవడం, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించడం పార్టీ కార్యకర్తల బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.ప్రత్యేకంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంత భారీ స్థాయిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో అనేకమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, అందువల్ల యువత, పార్టీ కార్యకర్తలు ఇటువంటి సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన చోడవరం వీర మహిళా అధ్యక్షురాలు నందవరపు రమాదేవి నాయుడు కి, అలాగే టీం జేఎస్పీ సభ్యులు ఎస్. నాని, జి. శ్రీను, టి. సునీల్, ఎం. సూర్య, హారేరామ్, వై. గోపీలకు పీవీఎస్ఎన్ రాజు ప్రత్యేకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో 100 మందికి పైగా రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం విశేషంగా నిలిచింది. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పలువురు యువత ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.

ఈ కార్యక్రమంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి , వినాయక ట్రస్ట్ బోర్డు చైర్మన్ మంగ శ్రీనివాసరావు , చోడవరం పట్టణ అధ్యక్షులు కర్రీ రమేష్ మండల ఉపాధ్యక్షులు తుమ్మపాల దేముళ్ళ నాయుడు , మహిళా అధ్యక్షురాలు నరవ సరోజిని , బుచ్చయ్యపేట మండల అధ్యక్షులు డి.ఎస్. నాయుడు ఉపాధ్యక్షులు తుమ్మపాల రమేష్, కూటమి నాయకులు గునూరు పెదబాబు పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.



## యువతను ప్రోత్సహించడం కోసమే గ్రామీణ గ్రంథాలయాల నిర్వహణ

### కిమ్స్ ఐకాన్ ఎండి

**మునగపాక,ఆగస్టు 30, జయ జయహే:**

మునగపాక మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గల జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, మహిళలకు పలు ఆటల పోటీలు వ్యాసరచన డిబేట్ పోటీలు నిర్వహించారు. శనివారం రాత్రి అనకాపల్లి వారిచే చీకటి బాట అనే నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కిమ్స్ ఐకాన్ ఎండి డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో గల యువతకు ఉపయోగపడే విధంగా నాన్న పేరుతో గ్రంథాలయం నిర్వహించడం ఎంత సంతోషంగా ఉందన్నారు. 15 సంవత్సరాలు పాటు నిరంతరంగా సేవలందిస్తున్న గ్రంథాలయానికి ప్రోత్సహిస్తున్న స్థానిక యువతకు కమిటీ వారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రవాస వాడ్రపల్లి వారిచే ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులుతో అభినందించారు. ఈ కార్యక్రమంలో పెతకంశెట్టి రామజోగి నాయుడు, బొడ్డేడ సత్యనారాయణ, కొయిలాడ దశావతారం, కాండ్రేగుల నూకరాజు, మల్ల వరహ నర్సింగరావు, మల్ల శేషుబాబు, మల్ల జోగినాయుడు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.



## ఎస్పీ రామోజు రమేష్‌కు "తెలంగాణ రత్న" పురస్కారం

**విశాఖపట్నం: (జయ జయహే)**

ఖమ్మం ఇంటెలిజెన్స్ శాఖకు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి పొందిన ఎస్పీ రామోజు రమేష్‌కు అభినందన సభ విశాఖపట్నంలోని హోటల్ డైమండ్స్ పెర్ల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ వివిధ సందర్భాల్లో అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఎస్పీ రామోజు రమేష్‌కు "తెలంగాణ రత్న" పురస్కారాన్ని జీటీఆర్ ఈవెంట్స్ సంస్థ అధినేత జి. త్యాగరాజన్ ప్రదానం చేశారు. అనంతరం రామోజు రమేష్ దంపతులను ఘనంగా సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జి. త్యాగరాజన్ మాట్లాడుతూ, పోలీసు శాఖలో రామోజు రమేష్ తన విధి నిర్వహణలో చూపిన అంకితభావం, నిబద్ధతను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు తెలిపారు. పోలీసు శాఖలో వివిధ ఉన్నత పురస్కారాలను అందుకోవడంతో పాటు, ప్రతిష్టాత్మకమైన పురస్కారాలను సైతం అందుకుని, ఎస్పీగా పదోన్నతి పొందిన రామోజు రమేష్ మరింత ఉన్నత స్థాయిలో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమం సర్జికల్స్ శ్రీనివాస్, సూరాడ వెంకట రమణ, సింగూరు రమేష్, జి. త్యాగరాజన్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జి.ఏ. నారాయణరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆత్మీయులు, మిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ అభినందన సభ ఘనంగా ముగిసింది.



## డా. వై. వి సుబ్బారెడ్డిని కలిసిన వైస్సార్సీపీ నాయకులు

**విశాఖపట్నం (జయ జయహే)**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పార్టీ నేత, రాజ్యసభ సభ్యులు డా. వై.వి. సుబ్బారెడ్డి ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా, గ్రాండ్ బే హోటల్‌లో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు , విశాఖ జిల్లా అధ్యక్షులు మరియు ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు , గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి లతో తో కలిసి డా. వై.వి. సుబ్బారెడ్డి ని 26వ వార్డు అధ్యక్షులు బొడ్డేటి కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు మరియు పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు

## రాజేంద్రపాలెంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 31,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పంచాయతీలో సెప్టెంబర్ 2వ తేదీ బుధవారం ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హాజరవుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండలంలోని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## స్థానిక ఎన్నికలకు ముందే రైతు బకాయిలు చెల్లించండి

### సీఎంను ఒప్పించే బాధ్యత కూటమి నాయకులదే

**చోడవరం ఆగస్టు 30 జయ జయహే**



స్థానిక ఎన్నికల గోవాడ సుగర్స్ పరిధిలోగల చెరకు రైతులకు సిబ్బందికి బకాయిలు చెల్లించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కూటమి నాయకులు ఒప్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ కే హరినాథ్ బాబా కోటమ నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చోడవరం మాడుగుల నియోజకవర్గాల నుండి జడ్పిటిసి ఎంపీటీసీ కి పోటీ చేయాలనుకుంటున్న కూటమి నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే నెల 3న జల హారతికి వస్తున్న నేపథ్యంలో జనసేన బిజెపి తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్తలు ముఖ్యమంత్రి కి ఒక వినతి పత్రం ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతుల కార్మికుల బకాయిలు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత చెల్లించలేదనీ, గ్రామాల్లో రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకొని చెరుకు పంట సాగు చేశారు మరి కొంతమంది రైతులు తమ దగ్గరున్న బంగారపు వస్తువులను బ్యాంకులో తాకట్టు పెట్టి ఆ వచ్చిన డబ్బుతో చెరుకు పంటను వేశారనీ వివరించాలన్నారు. మరి కొంతమంది చుట్టాలు బంధువుల వద్ద అప్పు తీసుకొని మరి చెరుకు పంటను వేసారని, వీరందరూ కలిపి కష్టపడి రెండు లక్షల 25 వేల టన్నుల చెరుకును కోదాడ సుగర్ ఫ్యాక్టరీ కి సరఫరా చేశారనీ చెప్పాలన్నారు. కానీ మన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు గాని కార్మికులకు గాని ఒక రూపాయి కూడా చెల్లించలేదనీ, రైతులు కార్మికులు మన కూటమి ప్రభుత్వంపై చాలా కోపంగా ఉన్నారని, కాబట్టి కార్మికులకు రైతులకు వెంటనే బకాయి చెల్లించేందుకు చేపట్టాలని కోరాలన్నారు. ఒకవేళ బకాయిలు చెల్లించకుండా మేము జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు ప్రచారానికి వెళితే మేము చాలా ఇబ్బందులు పడతామన్న విషయాన్ని చెప్పాలన్నారు. చెల్లించకపోతే వారంతా మాకు ఓటు వేస్తారన్న నమ్మకం లేదనీ సీఎంకు వివరించాలన్నారు.



## గిరిజన గ్రామాల్లో పోలీసుల అవగాహన

### నడింపాలెం జంక్షన్ లో వాహన తనిఖీలు..

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 31,**

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు, చింతపల్లి డీఎస్పీ సూచనలతో కొయ్యూరు సీఐ బి.శ్రీనివాసరావు మండలంలోని నడింపాలెం, తీగలమెట్ట, బట్టపనుకులు, కాట్రాగెడ్డ, బి.కొత్తూరు, పాడి, రత్నంపేట గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా గిరిజన గ్రామాల ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు భద్రత, గంజాయి నిర్మూలన, అక్రమ మద్యం, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.అనంతరం నడింపాలెం జంక్షన్ లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. మారుమూల ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా నిఘా నిర్వహించినట్లు సీఐ తెలిపారు. జూదం, గంజాయి అక్రమ రవాణా, అక్రమ మద్యం తయారీని అరికట్టేందుకు డ్రోన్ నిఘా కొనసాగిస్తామన్నారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు.



## పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీ

**విజయనగరం,ఆగస్టు 30: (జయ జయహే )**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా, విజయనగరం జిల్లా చిరంజీవి యువత, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం మరియు బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 12వ డివిజన్ ఇప్పిలి వీధిలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని జనసేన యువ నాయకులు,రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షులు చెల్లూరి ముత్యాల నాయుడు ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజిక కార్యకర్త త్యాడ రామకృష్ణారావు (బాలు) మాట్లాడుతూ..."పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఇంట్లో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా మన పరిసరాలను పచ్చగా మార్చడంతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలుగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి." అని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకులు లోకల్ బాయ్ ప్రసాద్, గొలగాన సురేంద్ర, జాడ గంగరాజు, కొయ్య హరి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం తగదు!

**సంతబొమ్మాళి:(జయ జయహే)**



నౌపడ -2 ఎంపీటీసీ సభ్యుడు బచ్చల సుధాకర్ మహిళలను ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించి రాజకీయం చేస్తున్నారని టెక్కలి నియోజకవర్గం జనసేన నాయకులు లింగూడు కుమార్ ఆరోపించారు. మూలపేట పునరావాస కాలనీ తాగునీరు పైప్ లైన్ పనులు జరుగుతుండగా ఉద్దేశపూర్వకంగా కొందరు మహిళలను సుధాకర్ రెచ్చగొట్టి ఆ పనులను నిలుపుదల చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ఆ పైప్ లైన్ పనులు పూర్తయితే సీతానగరం గ్రామానికి తాగునీరు అందిస్తామని కొద్ది నెలల క్రితం టెక్కలి జనసేన పార్టీ ఇంచార్జ్ కణితి కిరణ్ కుమార్ ద్వారా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయవాడ క్యాంపు కార్యాలయంలో కలిసినప్పుడు హామీ ఇవ్వటం జరిగింది. అయితే ఆ పనులు జరుగుతుండగా ఉద్దేశ పూర్వకంగా అడ్డుకుని ,రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసం ఆయన ప్రశ్నించారు. ఎం పి టి సీ అధికారంలో ఉన్న సమయంలో జలజీవన్ పనులు చేపట్టకుండా చేతులు దులుపుకున్నారు తప్ప... ఇంటింటికి బిందెడు తాగునీరుచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. మూలపేట కాలనీకి పనులు పూర్తయిన తర్వాత.. సీతానగరం గ్రామానికి తాగునీరు అందిస్తామని ఇటీవల నాయకులు, అధికారులు తెలిపారని వివరించారు.

For a pure tomorrow.. జయహే


# 'కడియం తీర్పు.. బొరుసుకే పట్టం'






**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 30**

కడియం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో బొరుసు సుబ్బారాయుడు 356 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. మొత్తం 1,997 ఓట్లలో 1,621 ఓట్లు పోలవగా, సుబ్బారాయుడుకు 985 ఓట్లు, ప్రత్యర్థి రత్నం అయ్యప్పకు 629 ఓట్లు లభించాయి. ఏడు ఓట్లు చెల్లనివిగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. లెక్కింపు ప్రారంభం నుంచి ఆధిక్యం కొనసాగించిన సుబ్బారాయుడికి అనంతరం ఎన్నికల అధికారులు విజయం ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. విజయం అనంతరం సుబ్బారాయుడు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి అత్యధిక మెజారిటీతో గెలిపించిన అసోసియేషన్ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సంక్షేమం, నర్సరీ రంగ అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం, కడియం నర్సరీల ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అందరినీ కలుపుకొని పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మొత్తం 11 వార్డుల్లో 9 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, పోలింగ్ జరిగిన 3, 7 వార్డుల్లో దూలం సత్యనారాయణమూర్తి, పుల్లా శ్రీను విజయం సాధించారు.



### ఉత్సాహంగా ఉల్లాసంగా

## పాత మిత్రులు కలయిక

**చోడవరం ఆగస్టు 30 జయ జయహే**

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1989-92 లో బీకాం డిగ్రీ చదువుకున్న పాత విద్యార్థులు ఆదివారం చోడవరం మండలం.వెంకన్నపాలెం ఐరిష్ కన్వెన్షన్ హాల్ లో గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపిన మిత్రులు వారి గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా అరకు ఇన్చార్జ్ ఎంపీడీవో గా పని చేస్తున్న మిత్రుడు వీరభద్రరావు కి, గోల్కొండ తహసిల్దార్ గా పనిచేస్తున్న శ్రీనివాసరావును సాలూరుతో ఘనంగా సత్కరించారు. అలాగే పలువురు ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా సత్కరించి కొనియాడారు. ఈ విద్యార్థులు ప్రతి రెండు వాళ్లకు ఒకసారి కలవాలని నిర్ణయించుకున్నారు.



## శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ

**రాజమహేంద్రవరం: జయ జయహే :ఆగస్టు 30**

కడియంశెట్టిబలిజ సమాజ అభ్యున్నతికి విశేష సేవలందించిన దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని కడియం మండలం మాధవరాయుడుపాలెం పంచాయతీ గుబ్బలవారిపాలెంలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాన్ని ప్రేమిస్తూ, ఇతర కులాలను గౌరవించాలని, సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని యువతకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో గోరంట్ల రవిరామ్ కిరణ్, మార్గాని సత్యనారాయణ, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మాజీ సర్పంచ్ అన్నందేవుల చంటి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షుడు వెలుగుబంటి నాని తదితరులు పాల్గొన్నారు.



## దుళ్ల ఎర్ర కాలనీలో చోరీ కలకలం

కడియం మండలం దుళ్ల గ్రామంలోని ఎర్ర కాలనీలో ఆదివారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. స్థానికుడు మానేంసత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి వేములపల్లిలో జరిగిన ఓ వేడుకకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.3.5 లక్షల నగదు, సుమారు 10 కాసుల బంగారం, వెండి వస్తువులను అపహరించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సత్యనారాయణ చోరీ జరిగినట్లు గుర్తించి కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న డిఎస్పీ శివప్రియ, ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తుండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ఇంటింటా టీడీపీ.. అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం

### 4వ వార్డు ఇంచార్జ్ శిలబోయిన వెంకటరమణ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం.. ఇంటింటా తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా నిడదవోలు పట్టణం 32వ బూత్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు, నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ సెక్రటరీ తిరుపతి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, ఆమతి శ్రీనివాస్, శిలబోయిన వెంకటరమణ, దేవెళ్ల శ్రీనివాస్, బొల్లం శ్రీనివాస్ గౌడ్, గారపాటి విజయకుమార్, సుంకవల్లి శ్రీధర్, కారంకి నవీన్, ఎస్కే కరీం, దాపత్తి ప్రభాకర్, ఘనసాల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### స్వప్నం కే మార్గ్ పర్ భారత్ యాత్ర

# పుస్తకాన్ని ఆవిష్కరించిన ఒడిశా గవర్నర్

**విశాఖపట్నం (జయ జయహే)**

సీనియర్ జర్నలిస్టు, సాహస యాత్రికుడు నాగనబోయిన నాగేశ్వరరావు (ఎన్ ఎన్.ఆర్) స్వీయ సాహస రచన కలల రహదారి హిందీ అనువాద పుస్తకాన్ని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ఆవిష్కరించారు. విశాఖపట్నం లోని తన క్యాంపు కార్యాలయంలో స్వప్నం కే మార్గ్‌పర్ భారత్ యాత్ర మే మేరా అనుభవ్ పుస్తక ఆవిష్కరణ అనంతరం గవర్నర్ హరిబాబు ఈ సాహస యాత్ర పుస్తకం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టు నాగేశ్వరరావు తన మిత్రుడు భరద్వాజ దయాల కలిసి 2004 సెప్టెంబర్ 19 న మోటారు సైకిళ్లపై భారత యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర 17 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల మీదుగా 45 రోజులు పాటు 10,063 కిలోమీటర్ల దూరం



సాగింది. విశాఖపట్నం నుండి మొదలైన మోటార్ సైకిల్ సాహస యాత్ర మూడు సముద్రాలు, కాశ్మీర్ నుండి కన్యాకుమారి, దేశంలోని నాలుగు ప్రధాన నగరాలు మీదుగా సాగి నవంబర్ రెండవ తేదీన విశాఖపట్నం రాకతో 45 రోజుల యాత్ర ముగిసింది. తన స్వీయ అనుభవాలను, 2019లో పుస్తకాన్ని వెలువరించారు. ఆ పుస్తకాన్ని ప్రముఖ కార్మిక నాయకులు డాక్టర్ కేఎస్ మోహన్ కుమార్, మాధవి సుహాసిని దంపతులు ప్రచురించారు. ప్రముఖ అనుదకురాలు పారనంది నిర్మల హిందీ లోకి అనువదించగా కే.ఎల్. ప్రసన్న గౌరీ హిందీ టైపింగ్, డిజైన్ చేశారు. ప్రేమ్ పబ్లికేషన్ తరఫున చాంద్ మాల్ అగర్వాల్ హిందీ అనువాద పుస్తకం స్వప్నం కే మార్గ్‌పర్ భారత్ యాత్ర మే మేరా అనుభవ్ పుస్తకాన్ని ప్రచురించారు. విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు పి. విష్ణుకుమార్ రాజు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జర్నలిస్టు ఎన్.ఎన్.ఆర్. ఇప్పటి వరకు ఏడు పుస్తకాలను రాశారు.



## నిడదవోలులో ఘనంగా ఒకినవన్ కుబోడో గోజోరియో కరాటే శిక్షణా శిబిరం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని ఎర్నగూడెం రోడ్‌లో శని, ఆదివారాల్లో (ఆగస్టు 29, 30) ఒకినవన్ కుబోడో గోజోరియో కరాటే ట్రైనింగ్ సెమినార్ విజయవంతంగా నిర్వహించారు. నిర్వాహకులు ఎం.వి. రామమూర్తి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా శిబిరానికి గోజోరియో కరాటే నేషనల్ చీఫ్, చీఫ్ టెక్నికల్ డైరెక్టర్, చీఫ్ ఇన్‌స్పెక్టర్, ఇంటర్నేషనల్ కోచ్ ఎల్. నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శిక్షణ అందించారు. శిబిరంలో విద్యార్థులకు ఆత్మరక్షణ మెలకువలతో పాటు కరాటే, నాంచాక్, స్టిక్ వెపన్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్థానిక విద్యార్థులు, కరాటే క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని వివిధ ఆత్మరక్షణ పద్ధతులను నేర్చుకున్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.



## నూతన జిమ్ స్థల పరిశీలన చేసిన కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్లో పురుషులకు మహిళలకు పిల్లలకు ఉపయోగకరంగా ఉండేలా నూతన ఓపెన్ జిమ్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో ఆదివారం మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఎన్టీఆర్ మార్కెట్ ను సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా ఓపెన్ నిర్మాణానికి అనువైన ప్రదేశాలను ఎమ్మెల్యే రామకృష్ణ పరిశీలించారు మార్కెట్ కు వచ్చే ప్రజలు ముఖ్యంగా పిల్లలు మహిళలు మరియు పురుషులు సౌకర్యవంతంగా వ్యాయామం చేసుకునే విధంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడానికి మార్కెట్లో పలు ప్రదేశాలను సందర్శించి అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగింది ప్రజల ఆరోగ్య శారీరక దృఢత్వాన్ని పంపించేందుకు ఓపెన్ జిమ్ములు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి అని రామకృష్ణ పేర్కొన్నారు మంజూరైన నిధులతో నాణ్యత పాటిస్తూ నిధులతో నాణ్యత పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఓపెన్ జిమ్ నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు మార్కెట్ కు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు



## మండల విద్యాశాఖాధికారి-2 త్రినాథ్ రావు సేవలు ఆదర్శనీయం

### త్రినాథ్ రావు దంపతులకు ఘన సన్మానం

**ముంచంగిపుట్టు, జయ జయహే**

మండల కేంద్రంలోని స్థానిక కళ్యాణ మండపంలో మండల విద్యాశాఖాధికారి-2 బి.హెచ్.వి.ఎస్.ఏ.ఎస్. త్రినాథ్ రావు పదవీ విరమణ సన్మాన సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు.త్రినాథ్ రావు ముంచంగిపుట్టు మండలంలోని జోలాపుట్టు జెడ్పీ హైస్కూల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించడంతో పాటు, మండల విద్యాశాఖాధికారి-2గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నెలాఖరుతో ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు త్రినాధరావు దంపతులను సాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు.మండల విద్యాశాఖాధికారి-2గా బాధ్యతలు నిర్వహించిన కాలంలో మండలంలోని పలు పాఠశాలలను నిరంతరం సందర్శిస్తూ మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పాఠశాలల నిర్వహణ తదితర అంశాలను పర్యవేక్షించారు. అలాగే మండలంలోని అన్ని పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను విజయవంతంగా పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించారు.విద్యాశాఖకు అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడుతూ, త్రినాథ్ రావు సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్. చెల్లయ్య, ఎంఈఓ కృష్ణమూర్తి, గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు బాజంగి బాబురావు, మఠం కొండపడాలి, ఎస్. మాలయ్య, ఎం. అనిల్, ఈ. మధుసూదన్, కె. సూర్యనారాయణ, కే. తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, వివిధ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, త్రినాధరావు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


## కమ్మవారిపాలెంలో ఘనంగా

# ప్రసన్న వెంకటేశ్వరస్వామి మహాకుంభాభిషేకం

### స్వామివారిని దర్శించుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**బుచ్చినాయుడు కండ్రిగ,ఆగస్టు 30,జయ జయహే**

సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలం కమ్మవారిపాలెం గ్రామంలో శ్రీశ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన అష్టబంధన మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో సత్యవేడు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. మహాకుంభాభిషేక మహోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఘనంగా ఆహ్వానించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలు, మహాకుంభాభిషేక కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, కేవీబీపురం మండలం టీడీపీ నాయకులు గోపీనాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అవసరపు సురేష్, వెంకటేష్ (పార్లపల్లి), నాగలాపురం మాజీ ఎంపీపీ జి.మురళి తదితరులతో పాటు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.





## వర్షం పడితే చెరువును తలపిస్తున్న రోడ్డు.. విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

**వరదయ్య పాలెం,ఆగస్టు 30,జయ జయహే**

వరదయ్య పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరి, రహదారి చెరువును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఇదే మార్గంలో పాఠశాలకు వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటితో గుంతలు కనిపించకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు జారిపడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చడంతో పాటు రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



## దేవస్థానం అభివృద్ధికి వినతిపత్రం

### సీఎంను కలిసిన శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ సాయి ప్రసాద్

**శ్రీకాళహస్తి,ఆగస్టు 30,జయ జయహే**

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు అందజేశారు. గుడ్డేరు కాలువ పై నిర్మించ తలపెట్టిన నూతన వంతెనకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. వంతెన నిర్మాణం పూర్తయితే శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు పట్టణంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు చైర్మన్ సాయి ప్రసాద్ తెలిపారు.

## చెన్నంపల్లిలో వన్నెరెడ్డి యువత

# సేవా సంఘం గ్రామ కమిటీ ఏర్పాటు

### యువత ఐక్యంగా ఉండి ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదగాలి: జిల్లా అధ్యక్షుడు మునిశేఖర్

**ఏర్పేడు,ఆగస్టు 30,జయ జయహే**

ఏర్పేడు మండలం చెన్నంపల్లి గ్రామంలో వన్నెరెడ్డి యువత సేవా సంఘం తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సంఘం గౌరవ అధ్యక్షులు తిరుపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎం. మునిశేఖర్, ఉపాధ్యక్షులు కేశువులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం. మునిశేఖర్ మాట్లాడుతూ యువత అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకుని ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా చెన్నంపల్లి గ్రామానికి నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



చెన్నంపల్లి గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులుగా టి. రాజశేఖర్, అధ్యక్షులుగా టి. భూపాల్, ఉపాధ్యక్షులుగా ఎ. గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీ. వెంకటేష్, కార్యదర్శిగా ఎ. మహేష్, సహాయ కార్యదర్శిగా ఎ. సురేష్, సహాయ కార్యనిర్వాహక అధికారిగా ఎ. పార్థు, కోశాధికారిగా వి. సాయి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఈ. గుణలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకులు ఉపేంద్ర, సాంబశివారెడ్డితో పాటు పలువురు యువత, సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బలం ఉన్నచోట్ల బరిలో దిగుతా

### జనసేన నిర్ణయం

**మాడుగుల ఆగస్టు 30 జయ జయహే**

చీడికాడ మండల జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం చీడికాడలో పార్టీ అధ్యక్షుడు జీ వీ మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు సెప్టెంబర్ 2న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా మండలంలో నిర్వహించి తలపెట్టిన కార్యక్రమాల గురించి త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం చర్చించారు. అలాగే జనసేన పార్టీ బలంగా ఉన్నచోట రానున్న స్థానిక ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు నిర్ణయించారు. అలాగే పవన్ కళ్యాణ్ బర్త్డే సందర్భంగా చీడికాడ మండలం చెట్టుపల్లి గ్రామంలో రక్తదాన శిబిరం,తుని వలస గ్రామంలో అన్నదాన కార్యక్రమం,అలాగే దిబ్బపాలెం గ్రామంలో చనిపోయిన జనసైనికుడు కుటుంబానికి జనసైనికులు సేకరించిన నగదును అందించుట, బైలపూడి,మంచాల, అర్జునగిరి గ్రామంలో మొక్కల పంపిణీ, ఇతర సేవా కార్యక్రమాలు, కండివరం గ్రామంలో దేశభక్తి గేయాలు పాటల పోటీ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల పార్టీ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు జన సైనికులు పాల్గొన్నారు.



## శ్రీ శిరిడీ సాయినాథుని దర్శించుకున్న ప్రముఖ వైద్యుడు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 30,జయ జయహే**

శ్రీకాళహస్తి చెన్నై చిత్రాస్ హాస్పిటల్ అధినేత, ఆల్ ఇండియా గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ సిహెచ్. కృష్ణయ్య శ్రీకాళహస్తి చెన్నై రోడ్డులోని శ్రీ శిరిడీ సాయినాథుని ఆలయాన్ని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి రమేష్ బాబు ఆయనకు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు డాక్టర్ సిహెచ్. కృష్ణయ్యను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఎన్నో సంవత్సరాలుగా కొలువై ఉన్న శ్రీ శిరిడీ సాయిబాబా ఆలయం ఎంతో అద్భుతంగా ఉందన్నారు. ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుకున్న భక్తుల కోరికలు తప్పక నెరవేరుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## శక్తి మహిళా పోలీసులతో విస్తృత అవగాహన

**తిరుపతి,ఆగస్టు 30,జయ జయహే**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు శక్తి మహిళా పోలీసులు జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విజిబుల్ పోలీసింగ్ చేపడుతున్నారు. ఇందులో భాగంగా ధామినేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతంలో శక్తి మహిళా పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, గృహ హింస, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువతలో ఏర్పడే ఆకర్షణలు, వాటి కారణంగా ఎదురయ్యే సమస్యలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్రమశిక్షణతో వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరించారు. అదేవిధంగా రైతు మార్కెట్ ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి ప్రజలకు భద్రతా భరోసా కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు. బాలికలు, మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని శక్తి మహిళా పోలీసులు సూచించారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.



## వర్షాకాలంలో

# బెస్ట్ డ్రింక్స్

వర్షాకాలంలో చల్లటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నా పలు ఇన్ఫెక్షన్లు దాడి చేసే ముప్పు పొంచి ఉంటుంది. వర్షాలతో నీరు నిలిచే పరిస్థితి ఏర్పడటం ద్వారా దోమల వ్యాప్తితో పలు రకాల వైరస్‌లు, ఇన్ఫెక్షన్ల ముప్పు ఎదురవుతుంది. వర్షాకాలంలో వైరస్‌లు, ఇన్ఫెక్షన్ల బారినపడకుండా రోగనిరోధక శక్తి పెంచే పానీయాలు, ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆరోగ్యకర ఆహారం కీలకమని వైద్యులు సూచిస్తుంటారు. ఇక ఈ సీజన్‌లో మన ఇంట్లో లభించే పదార్థాలతోనే ఇమ్యూనిటీని మెరుగుపరుచుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అందరి ఇండ్లలో కిచెన్‌లో దొరికే దాల్చిన చెక్క ఈ సీజన్‌లో వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు దివ్యౌషధంలా పనిచేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం టీ మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుస్తుంది. దాల్చిన చెక్క, అల్లం రెండింటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉ ఒడటంతో వర్షాకాలంలో ఇమ్యూనిటీని బలోపేతం చేస్తుంది. ఈ టీని రోజూ తీసుకోవడం ద్వారా మనలో రోగనిరోధక వ్యవస్థ మెరుగవుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇక దాల్చిన చెక్క, థైమ్ టీ వర్షాకాలంలో సిప్ చేసేందుకు మేలైన ప్రత్యామ్నాయం. ఈ టీ తీసుకోవడం ద్వారా గొంతు నొప్పి మటుమాయం కావడంతో పాటు హానికారక ఇన్ఫెక్షన్స్‌ను దీటుగా ఎదుర్కొంటుంది. ఈ టీ తీసుకుంటే జలుబు, దగ్గును కూడా నివారించవచ్చు. ఇక వర్షాకాలంలో దాల్చినచెక్కతో చేసిన ఈ పానీయాలను ట్రై చేయండి..

దాల్చిన చెక్క, అల్లం టీ
దాల్చిన చెక్క గ్రీన్ టీ
దాల్చిన చెక్క పాలు
దాల్చిన చెక్క, హనీ వాటర్
దాల్చిన చెక్క, థైమ్ టీ

# హ్యాంగోవర్‌తో తల పగిలిపోతోందా?

## ఈజీగా తగ్గించే ఆహారాలు



**లేట్‌నైట్ పార్టీలు, మందు, విందులతో ఎంజాయ్ చేసేవారు.. ఆ మర్నాడు హ్యాంగోవర్‌తో ఇబ్బంది పడుతుంటారు. అయితే, ఆల్కహాల్ తాగిన అందరికీ ఈ సమస్య రాదు. వచ్చినా ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. హ్యాంగోవర్ అనేది ఎవరిలో ఏ స్థాయిలో ఇబ్బంది పడుతుంది అనేది దాని తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది.. అయితే, హ్యాంగోవర్‌ను తగ్గించుకునేందుకు ఏం చేయాలతో తెలియక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. దీనిని సహజంగా తగ్గించుకోవడానికి ఇంట్లో కొన్ని చిట్కాలను ఫాలో అవ్వొచ్చు అంటున్నారు నిపుణులు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..**

హ్యాంగోవర్‌ని తగ్గించడంలో తేనె బాగా హెల్ప్ చేస్తుంది. తేనెతేనెలో జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా మార్చే పోషకాలు అధికంగా ఉంటాయి. తేనెను తీసుకోవడంతో శరీరంలో ఆల్కాహాల్ తాగడంతో జరిగిన ఎఫెక్ట్స్ తగ్గుతాయి. వివిధ పదార్థాల్లో తేనె కలుపుకొని తీసుకుంటే మంచిది. అలాగే, కొబ్బరి నీళ్లు కూడా ఎంతగానో ఉ పయోగపడతాయి. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్ రిచ్ ఫ్లూయిడ్స్ హ్యాంగోవర్‌ను తగ్గిస్తాయి. శరీరంలో తగ్గిపోయిన న్యూట్రిషన్స్‌ను తిరిగి అందిస్తాయి. హ్యాంగోవర్ సమయంలో డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి తరచూ నీళ్లు తాగుతూ ఉ ఒడటం మంచిది. హైడ్రేటెడ్‌గా ఉండడం వల్ల హ్యాంగోవర్ తగ్గుతుంది.. శరీరం నుంచి టాక్సిన్లు బయటకి పోతాయి. ఈ సమయంలో కూల్ డ్రింక్స్ తీసుకుంటే పరిస్థితి విషమిస్తుంది. కొబ్బరి నీరు వంటి ఎలక్ట్రోలైట్ అధికంగా ఉ ఒడే పానీయాలు హైడ్రేటెడ్‌గా ఉండడంలో హెల్ప్ చేస్తాయి. అలాగే,


నిమ్మకాయ.. నిమ్మకాయ అనేది హ్యాంగోవర్‌ను సులభంగా తగ్గిస్తుంది. నిమ్మలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. నిమ్మ టీ తాగడం లేదా నిమ్మరసం తాగడంతో హ్యాంగోవర్ తగ్గుతుంది. అరటి పండు కూడా హ్యాంగోవర్‌లో ఉపయోగపడుతుంది. అరటిలో పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని అందిస్తాయి. అరటి తింటే మైకము, అలసట తగ్గుతుంది. హ్యాంగోవర్‌కు మజ్జిగ కూడా మంచి మందులా పనిచేస్తుంది. మజ్జిగలో పోషకాలు అధికంగా ఉంటాయి. మజ్జిగ తాగితే హ్యాంగోవర్ తగ్గుతుంది. ఆల్కాహాల్ తాగితే శరీరం డీ హైడ్రేట్ అవుతుంది. మజ్జిగ తాగితే హైడ్రేట్‌గా ఉంచుతుంది.

హ్యాంగోవర్‌తో ఇబ్బంది పడుతున్నప్పుడు పుదీనా వాడకం కూడా మేలు చేస్తుంది. పుదీనా కడుపును శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. పుదీనాను వివిధ రూపాల్లో తీసుకుంటే కడుపులోని అదరపు గ్యాస్ తొలగుతుంది. అలాగే, హ్యాంగోవర్ సమయంలో గుడ్లు తినడం కూడా మంచిది. గుడ్లలో ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. గుడ్లలోని ప్రోటీన్లు టాక్సిన్లను తొలగిస్తాయి. హ్యాంగోవర్‌ను కంట్రోల్ చేస్తాయి.

# వింటేజ్ సొగసు



**అతివల అలంకరణలో ఎన్ని ఎక్కువ ఆభరణాలు ఉంటే అంత అందం. ఎప్పటికప్పుడు సరికొత్త డిజైన్లతో వినూత్నమైన నగలను వేసుకుని మురిసిపోతుంటారు. ఈ ట్రెండ్‌ను గమనించిన డిజైనర్లు మగువల మనసు దోచేలా కొత్తకొత్త డిజైన్లు ఆవిష్కరిస్తున్నారు.**





అతివల అలంకరణలో ఎన్ని ఎక్కువ ఆభరణాలు ఉంటే అంత అందం. ఎప్పటికప్పుడు సరికొత్త డిజైన్లతో వినూత్నమైన నగలను వేసుకుని మురిసిపోతుంటారు. ఈ ట్రెండ్‌ను గమనించిన డిజైనర్లు మగువల మనసు దోచేలా కొత్తకొత్త డిజైన్లు ఆవిష్కరిస్తున్నారు. అలా ట్రెండ్ ఫాలో అవుతూ మార్కెట్‌లోకి వచ్చిందే వింటేజ్ జువెలరీ.

ఆధునిక సొబగులు అద్దుకున్న వింటేజ్ నగలపై ఈ తరం మహిళలు మోజుపడుతున్నారు. సంప్రదాయ వేడుకలు, పండగల్లో చీరకట్టులో కనికట్టు చేసే సుందరీమణుల మెడల్లో ఇవి ఎంచక్కా ఒదిగిపోతున్నాయి. కాలం మారినా 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అని మురిపిస్తున్న వింటేజ్ జువెలరీ విశేషాలివి..

అమ్మమ్మ కాసుల పేరు, నానమ్మ కంటె, కడియాలు.. ఇలా పలురకాల నగలు వారసత్వంగా మనవరాళ్ల నగలపెట్టెలో అడుగునపడి ఉంటాయి. ఇవేకాదు.. గుండ్ల హారాలు, ఎనల గొలుసులు, ముంజేతి కడియాలు, జడ చుక్కలు.. ఇలా చాలా రకాల ఆభరణాలు తాతమ్మ తరంలో ఫ్యాషన్. కాలక్రమంలో కరిగిపోయిన ఈ నగలు మరోసారి పురుడు పోసుకుంటున్నాయి. ముఖ్యంగా చంద్రహారాలు, సూర్యహారాలు, అష్టలక్ష్మి గొలుసులు, కమ్మలు-బుట్టాలు, వంకీలు, రవ్వల గాజులు, ఒడ్డాణాలు ఇలా ఆ పాతకాలం మెరుపులన్నీ ఈ తరానికి చేరువ అవుతున్నాయి. వీటికి యాంటిక్ జువెలరీగా పేరు పెట్టి అతివలు ప్రత్యేకంగా ఆదరిస్తున్నారు. ఎలిగెంట్ లుక్‌తో అలరిస్తున్న ఈ నగలు ధరిస్తే పండుగ సందడి రెండింతలు కావడం ఖాయం.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com